

జెసి.ప్రభాకర్‌రెడ్డి తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పట్ల సోమవారం నాడు అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తీరును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు నిరసనలు తెలిపారు. కలెక్టర్‌కు మద్దతు తెలుపుతూ ప్రభుత్వ ఉద్యోగులు వారివారి కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతపురం జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లోనూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యాలయ విధుల్లో పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, డీఆర్డీఏ, చేనేత, జౌళి శాఖ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది తమ కార్యాలయాల వద్ద నిరసన తెలిపి జెసి.ప్రభాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్పందన కార్యక్రమంలో జెసి.ప్రభాకర్‌రెడ్డి ఎంత దురుసుగా ప్రవర్తిస్తున్నా కలెక్టర్ సంయమనం కోల్పోకుండా వ్యవహరించారని ఉద్యోగులు తెలిపారు. కలెక్టర్ స్థాయి అధికారిపై జెసి.ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేమనీయం అని, తక్షణం ఆయన క్షమాపనలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



వదర ప్రభావిత ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు

నడిమివంక రక్షణ గోడను నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని నడిమివంకకు ఇరువైపులా ప్రహరీ నిర్మించి, సోమనాథ్ నగర్ బ్రిడ్జి వెడల్పు చేసి ఎత్తు పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 2వ రోజు కొనసాగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నగరంలో ఇటీవల వరదలతో నష్టపోయిన కాలనీవాసులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో వరదలు సంభవించి ప్రజలు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం, పాలకులు స్పందించకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. వరదల సమయంలో వరద ప్రాంతాల్లో హడావుడి చేసిన నాయకులు ఆ తరువాత ఆ ప్రాంతాల దరిదాపులకు కూడా వెళ్లలేదన్నారు. ప్రజలు నిలదీస్తారని భయంతోనే నాయకులు వారి వద్దకు వెళ్లడం లేదన్నారు. సోమనాథ్‌నగర్ నుంచి శాంతినగర్‌కు వెళ్లే, రిషితా పబ్లిక్ స్కూల్ దగ్గర ఉన్న బ్రిడ్జి రక్షణ గోడను తొలగించారన్నారు. ప్రస్తుతం దానిని నిర్మించకపోవడంతో ఎదురు ఎదురుగా రెండు వాహనాలు వస్తే వంకలో పడిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. వరదల్లో నష్టపోయిన ప్రతి కుటుంబానికీ కనిష్టంగా రూ.2 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలనీల్లో సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేసే ఆందోళనల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముష్కిన్, నగర కమిటీ సభ్యులు ప్రకాష్, వలీ, ఎన్టీఆర్ శీనా, ప్రసాద్, వెంకటేష్, మసూద్, బాబు, రాజు, రమణ, రామాంజి, గఫూర్, జైకష్ణ, రామాచారి, ఆటో యూనియన్ నాయకులు శివ, నాగరాజు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్ష పదవికి

కాపు రామచంద్రారెడ్డి రాజీనామా

ప్రజాశక్తి-రాయదుర్గం



వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్ష పదవికి కాపు రామచంద్రారెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డికి మంగళవారం లేఖను పంపారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడుతూ తమ కుటుంబంలో జరిగిన విషాద ఘటనతో, పాటు రాయదుర్గం నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలపై దష్టి సారించాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పదవిని తాను నిర్వహించలేకపోతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పదవికి రాజీనామా చేశానని చెప్పారు. తన రాజీనామా విజ్ఞప్తిని మన్నించి ఆమోదించినందుకు జగన్మోహన్‌రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్ష, పదవి బాధ్యతలు నిర్వహించేందుకు సహకరించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లాలోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు కతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన కాపు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డి తన భార్య భారతితో కలిసి మంగళవారం నాడు కలిశారు. పలు విషయాలపై ముఖ్యమంత్రితో ఆయన చర్చించారు.



రామయ్య పొలం వద్ద కంచెను తొలగిస్తున్న అధికారులు

పేద రైతుపై.. సర్కారు జులుం..!

“తనకున్న ఏకైక ఆదరువు మూడున్నర ఎకరాల భూమి. దాన్ని బలవంతంగా లాక్కుని, తమ బతుకులను బజారుపాలు చేయొద్దు” అంటూ ఒక పేద రైతు గడిచిన ఏడేళ్లుగా పోరాడుతూనే ఉన్నాడు. అయితే సర్కారు ఎలాగైన ఆ భూమిని వారు అనుకున్న సంస్థకు కట్టబెట్టాలని సర్వ శక్తులనూ ఉపయోగించి జులూం సాగిస్తోంది. అండగా నిలవాల్సిన అధికారులే అన్నీ లాక్కునేందుకు సిద్ధపడుతున్నారు. కనీసం మార్కెట్ ధర ప్రకారమైనా పరిహారమివ్వమంటే ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. అరకొర పరిహారమే ఇస్తాం ఖాళీ చేయమని నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో తన బాధ ఎవరితో చెప్పకోవాలో పాలుపోక ఆ పేద రైతు దిక్కులు చూస్తున్నాడు. సత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల పరిధిలోని పాలసముద్రం వద్ద ఓ రైతు పడుతున్న కన్నీటి వ్యథ ఇది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

- ◆ పొలం చుట్టూ వేసిన కంచె తొలగింపు
- ◆ న్యాయం చేయమన్నందుకు నిర్బంధం
- ◆ పెద్దవారి పట్ల ఉదారత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సోమందేపల్లి మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన వి.రామయ్య యాదవ్ అనే రైతు తన తాతలకాలం నుంచి వస్తున్న 3.50 ఎకరాల పొలాన్ని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతోపాటు, పొలం పక్కనే చిన్నపాటి టీ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగ రాష్ట్ర విభజన అనంతరం పాలసముద్రం వద్ద నాసిన్ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధపడింది. దీనికి 550 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో అత్యధికంగా నిరుపేద రైతులే ఉన్నారు. ఇందులో రామయ్య మూడున్నర ఎకరాల పొలమూ ఉంది. అయితే రామయ్య ఉన్న ఒక్క ఆదరువు ఇవ్వడానికి సిద్ధపడలేదు. దీన్ని నాసిన్ సంస్థకు ఇవ్వనని చెప్పాడు. కాని అధికారులు మాత్రం ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఏమి చేయాలో పాలుపోక 2016లో హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం దీనిపై స్టే ఇచ్చింది. కొంతకాలం మౌనంగానున్న అధికారులు తరువాత పొలానికి విద్యుత్ సరఫరాను నిలిపేశారు. దీంతో రామయ్య మరోమారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో విద్యుత్‌ను అధికారులు పునరుద్ధరించక తప్పలేదు. ఇప్పటికీ ఈ కేసు న్యాయస్థానంలో నడుస్తూనే ఉంది. ఆయన అంగీకారం మేరకు చర్యలు తీసుకోవాలన్న మార్గదర్శకాలను న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. అయితే అధికారులు ఆ దిశగా కాకుండా ఏదోరకంగా రామయ్యను పొలం నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలనే చేస్తుండటం గమనార్హం. పొలం చుట్టూ కంచె వేసుకున్నందుకు మంగళవారం నాడు పోలీసు బలగాలతో తహశీల్దార్ అక్కడికి విచ్చేసి కంచెను తొలగించారు. తన పొలంలో తాను కంచె వేసుకున్నానని రామయ్య చెబుతున్నా పట్టించుకోకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా తొలగించారు. కోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోకుండా మూడు ఎకరాలు ఖాళీ చేయాల్సిందేనన్నట్టు అతడిపై అధికారులు ఒత్తిడి పెంచుతుండటం గమనార్హం.



బాధిత రైతు వి.రామయ్య

పెద్దల భూమిపై ప్రేమ

ఇదే భూమికి కొంత దూరంలో ఒక వ్యక్తి రియల్‌ఎస్టేట్ సంస్థ పేరుతో 59 ఎకరాలను కొనుగోలు చేశాడు. ఇందులో సుమారు 24 ఎకరాల భూమి అసైన్డ్‌గా ఉంది. దీన్ని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకుని విల్లాల నిర్మాణం చేపట్టి యథేచ్ఛగా అమ్మకాలు సాగించారు. ఆ భూమిని మాత్రం నాసిన్ కోసం స్వాధీనం చేసుకోకుండా ప్రహరీ వెనక్కు జరిపి కట్టారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వ్యక్తం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. హిందూపురం పట్టణం వైపు వెళ్లే మార్గంలో ఉన్న నాసిన్ ప్రధాన ద్వారం పక్కనే పెద్ద భవంతిని ఆ సంస్థ నిర్మాణం చేపడుతోంది. దీనిపై కూడా అధికారులు ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఈ విల్లాల్లో కొంత మంది అధికారులకు బహుమతులున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. పెద్దలపట్ల ఇలా ఉండే అధికారులు, పేద రైతును మాత్రం నిత్యం ఇబ్బందులపాలు జేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలంటూ బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నాడు.



నాసిన్ ప్రధాన ద్వారం వద్ద నిర్మితం అవుతున్న విల్లా

అధికారుల తీరు దుర్మార్గం

ఉన్నత న్యాయస్థానంలో కేసు నడుస్తుండగా ఎటువంటి తీర్పురాకనే రైతు రామయ్య కుటుంబాన్ని పోలీస్ స్టేషన్లో బంధించి పోలీస్, రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా భూమిని ఆక్రమించేందుకు యత్నించడం సరికాదు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతుకు న్యాయం చేయకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు. రైతుల్ని భయభ్రాంతులకు గురిచేసే విధంగా అధికారులు ప్రవర్తించడం నీచమైన చర్య. రైతు న్యాయం చేసేందుకు ఆయన పక్షనా పోరాటం నిర్వహిస్తాం.

పెద్దన్న, వ్యకాసం జిల్లా కార్యదర్శి.

సత్యసాయి కార్మికులతో అధికారుల చర్చలు విఫలం

గ్రాట్యూటీ చెల్లించేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్న నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పిఎబిఆర్ డ్యాం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ బాషా, డిఇలు కార్మిక సంఘం నాయకులు, కార్మికులతో మంగళవారం జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. గ్రాట్యూటీ చెల్లింపులకు సంబంధించి ఎల్అండ్‌టి కంపెనీకి లేఖ రాశామని, వారు స్పందించిన వెంటనే గ్రాట్యూటీ చెల్లిస్తామని అధికారులు తెలిపారు. మార్చిలోపు చెల్లిస్తామనడంతో యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులు, ఇతర నేతలు అంగీకారం తెలుపలేదు. గ్రాట్యూటీ ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. చర్చలు విఫలం కావడంతో సమ్మె కొనసాగుతుందని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికుల యూనియన్ నాయకులు తిప్పేస్వామి, మహబూబ్‌బాషా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఎండ్లూరి చిద్విలాస్‌కు బంగారు పతకం

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మైరెడ్డి నీరజ

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక వైద్య కళాశాలలో ఆఖరి సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న ఎండ్లూరి చిద్విలాస్ మొట్టమొదటి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నీరజ మంగళవారం తన ఛాంబర్‌లో చిద్విలాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆంధ్ర వైద్య కళాశాల విశాఖ పట్టణం తర్వాత సైకియాట్రిలో గోల్డ్ మెడల్‌ను అందిస్తున్న రెండవ కళాశాలగా అనంతపురానికి గుర్తింపు తీసుకురావడంలో కృషి చేసిన సెకియాట్రి హెచ్‌ఒడి డాక్టర్ వైద్యనాథ్‌ను, తన తండ్రి జ్ఞాపకార్థం తన సొంత డబ్బులతో గోల్డ్ మెడలను అందిస్తున్న డాక్టర్ అనిల్ కుమార్‌ను, ఇతర సైకియాట్రి డాక్టర్లను అభినందిస్తున్నానన్నారు. అంతేగాకుండా మొట్ట మొదటి గోల్డ్ మెడల్‌ను సాధించిన స్ఫూర్తిగా తీసుకుని జూనియర్ విద్యార్థులు మరింత బాగా చదివి మానసిక శాస్త్ర వైద్య జ్ఞానాన్ని మానసిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్ సోనియా, సైకియాట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వరదరాజులు, డి.అడిక్షన్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శశాంక్, తదితరులు పాల్గొన్నారు.



ఎండ్లూరి చిద్విలాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మైరెడ్డి నీరజ

అహుడా పరిధి 17873.66 కి॥మీ॥ పెంపు

అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిని 17837.66 చదరపు కిలోమీటర్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక అహుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ తర్వాత అధిక విస్తీర్ణం అహుడా అవతరించిందన్నారు. రాష్ట్రంలో అహుడా రెండవ స్థానంలో ఉందన్నారు. అహుడా పరిధిలోకి అనంతపురం, సత్యసాయి జిల్లాలోని 13 నియోజకవర్గాలు చేరాయన్నారు. పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మినహాయించి ఉమ్మడి అనంతపురం జిల్లా అహుడా పరిధిలోకి చేరిందన్నారు. అహుడా పరిధిలో జగనన్న లేఅవుట్లు, స్మార్ట్ సిటీలు నిర్మించటం ద్వారా పేద మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించనున్నట్లు తెలిపారు. లాభాపేక్ష లేకుండా ప్రజలకు ఖరీదైన స్థలాలను తక్కువ ధరలోకి అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఆ దిశగా అహుడా అడుగులు వేస్తోందన్నారు ఇప్పటికే కుఋతూరు వద్ద జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసి స్థలాలను విక్రయించినట్లు తెలిపారు. అలాగే కోడికొండ చెక్‌పోస్ట్ వద్ద జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేశామన్నారు. అక్కడ ప్రయివేటు స్థలాల్లో సెంటు రూ.10లక్షల ధర పలుకుతోందన్నారు. అయితే జగనన్న లేఅవుట్‌లో రూ.3.5లక్షలకే సెంటు భూమిని అందుబాటులోకి తేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన వారు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు పడకుండా స్థలాలను అన్ని అనుమతులతో పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అహుడా వైస్ ఛైర్మన్ మురళీకృష్ణగౌడ్, ప్లానింగ్ ఆఫీసర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ పోస్టులు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్త్రీశిశు సంక్షేమ శాఖలో ఇన్‌ఛార్జి సూపర్ వైజర్‌పోస్టుల భర్తీని నిలుపుదల చేసి శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం సిడిపిఒ లలితమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున మాట్లాడుతూ గ్రేడ్-2 సూపర్‌వైజర్ల రాత పరీక్షల్లో అక్రమాలు జరిగాయని అనేక మంది అంగన్‌వాడీ కార్మికులు కోర్టుకు వెళ్లారన్నారు. కోర్టు తీర్పు రాకమునుపే ఇన్‌చార్జీ సూపర్‌వైజర్లను తాత్కాలిక పద్ధతిలో నియమించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, వరలక్ష్మి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిడిపిఒ లలితమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రహదారి భద్రతకు చర్యలు : కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రహదారి భద్రత కోసం సమగ్ర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ డా॥ఫక్కీరప్ప అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రహదారి భద్రత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పని చేసినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రాణాలు కాపాడగలమన్నారు. జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులను వేగంగా పూర్తి చేయాలన్నారు. నూతన రోడ్ల నిర్మాణ పనుల వల్ల పలు రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. జాతీయ రహదారులు, బ్రిడ్జిల నిర్మాణం కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్ల నిర్మాణం, నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందిపడుతున్న ప్రాంతాలను 40 వరకూ గుర్తించామన్నారు. రహదారులపై అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న డివైడర్ ఓపెనింగ్‌లను ఎప్పటికప్పుడు మూసివేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగి చికిత్స నిమిత్తం క్షతగాత్రులు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తే అక్కడ సరైన సమయంలో చికిత్స అందడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వాసుపత్రి అత్యవసర సేవల కౌంటర్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. రహదారి భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఐరాడ్ వెబ్‌సైట్ లో ఎప్పటికప్పుడు రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులు, మతుల వివరాలు నమోదు చేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పట్టణాల్లో రోడ్లపై పశువులు తిరగకుండా చూడాలన్నారు. ఇందుకోసం మున్సిపల్ కమీషనర్లు ఆ పట్టణాల్లో పశు పెంపకందారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణ లక్ష్యంగా అందరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ శివరామప్రసాద్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఇ ఓబుల్‌రెడ్డి, డిఎంహెచ్ఒ విశ్వనాథయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేగవంతంగా సర్వే రాళ్లు నాటే ప్రక్రియ

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

పెద్దవడుగూరు : జగనన్న శాశ్వత భూహక్కు చట్టం కింద నిర్వహిస్తున్న భూసర్వేలో కీలకమైన సరిహద్దులు గుర్తింపు, సర్వే రాళ్లు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో రీ సర్వేలో భాగంగా సర్వే రాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్జెక్షన్ సర్వేను ఉద్దేశించి సాంకేతిక పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈరమ్మ, పంచాయతీ సెక్రటరీ, డిప్యూటీ సర్వేయర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



నాసా కిట్లతో విద్యార్థులు

నాసా కిట్లు పంపిణీ

అనంతపురం : స్థానిక బస్టాండ్ సమీపంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నాసా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేడు భారతదేశం శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లో వైవిధ్యమైన ఆవిష్కరణలకు మూలబిందువుగా మారుతోందన్నారు. ఇందులో శ్రీచైతన్య విద్యార్థులు భాగమవుతున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పర్వీన్‌భాను, డీన్ చంద్రమోహన్, నాసా ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : మండలంలో కొత్తగా పట్టాదార్ పాసు పుస్తకం పొందినవారు రైతు భరోసా కోసం ఆర్‌బికెల్లో సంప్రదించి నమోదు చేయించుకోవాలి ఎఒ కాత్యాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ పుస్తకం జిరాక్స్ కాపీలను అందజేయాలని కోరారు.

చిన్నారులకు ఆర్థికసాయం

కళ్యాణదుర్గం : శెట్టూరు మండల పరిధిలోని బసాపురం గ్రామానికి చెందిన మధుసూదన్‌చౌదరి అనారోగ్యంతో నెలక్రితం మృతిచెందడంతో సోషల్ మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న సత్యసాయి జిల్లా విశ్రాంత ఉద్యోగులు మంగళవారం కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి పెద్దదిక్కు మృతి చెందడంతో పిల్లలు చదివించేందుకు భార్య పడుతున్న ఇబ్బందులను సోషల్ మీడియాలో చూసి విశ్రాంతి ఉద్యోగులు మంగళవారం వారి నివాసానికి వెళ్లి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ ప్రెసిడెంట్ లింగ రామ్మోహన్, విశ్రాంత ఉద్యోగి రామప్ప, శ్రీనివాసులు, గోపాల్, రఘుగంగ బోర్ వెల్స్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

16న రాష్ట్రస్థాయి సెమినార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రం, జిల్లాలో అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో ఏర్పడిన వ్యవసాయ సంక్షోభంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16, 17, 18వ తేదీల్లో కడపలో రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తరమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం రైతుసంఘం జిల్లా కార్యాలయంలో సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో నిర్వహించే మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతుల్లో మొదటి రోజు ఈనెల 16న కడప జిల్లా పరిషత్ మెయిన్ హాల్‌లో వ్యవసాయ సంక్షోభం పరిష్కార మార్గాలు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16న నిర్వహించే రాష్ట్ర స్థాయి సెమినార్‌లో వ్యవసాయ పంప్ సెట్లకు విద్యుత్ మీటర్లు రైతులపై ప్రభావం అనే అంశంపై నిర్వహించే సెమినార్‌కు ముఖ్య వక్తగా విద్యుత్ రంగ నిపుణులు కే.అశోక్ రావు, వ్యవసాయ రంగ సంక్షోభం పరిష్కార మార్గాలు అనే అంశంపై ముఖ్య వక్తగా ఏపీ రైతు సంఘం పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు పాలకుల వైఖరి అనే అంశంపై రైతుసంఘం సీనియర్ నాయకులు బి.నారాయణ ముఖ్య వక్తలుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సెమినార్‌లను రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

గూగూడు, గంగనపల్లి సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని గూగూడు, గంగనపల్లి గ్రామ సచివాలయాలను అనంతపురం డివిజినల్ అభివృద్ధి అధికారిణి సి.ఓబుళమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గూగూడు ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రంలో తయారైన వర్మీకంపోస్టును ఎక్కువ రోజులు అమ్మకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎక్కువ రోజులు ఉంటే ఎరువులో సారం లేకుండా పోతుందన్నారు. అలాగే గూగూడుకు సందర్శకులు ఎక్కువగా వస్తుంటారని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించి ఎస్‌డబ్ల్యుబిసి కేంద్రాలకు తరలించాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఆయుష్మాన్ భారత్ యాప్‌లో నమోదు, నాడు-నేడు ప్రగతి, పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనం అమలు తదితర వివరాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం సచివాలయాలు, సిబ్బందిని, వాలంటీర్లను నియమించిందన్నారు. అనంతరం గంగనపల్లిలోని ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాన్ని పరిశీలించి, అక్కడి వాతావరణం, మొక్కలు పెంచుతున్న తీరు, వ్యర్థాలను సంపదగా వర్మీ కంపోస్ట్‌గా తయారు చేస్తున్న తీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాఘవేంద్ర, ఆదినారాయణ, వీఆర్వోలు వంశీకృష్ణ, చంద్ర, సచివాలయ సిబ్బంది, ఉపేంద్ర, హరి, అయేషాబి, మణికంఠ, కుమార్ రాజా, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అల్లర్లకు ప్రతిపక్షాల కుట్ర

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికి ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. మంగళవారం నగరంలోని 32వ డివిజన్‌లో కార్పొరేటర్ కమల్‌భూషణ్‌తో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి మూడేళ్లుగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కలిగిన లబ్ధిని వివరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ నాయకత్వంలో వైసీపీ అధికారంలోకి వచ్చి మూడేళ్ల మూడు నెలలైందన్నారు. గతంలో ఎవరూ చేయని విధంగా సంక్షేమం, అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎవరిని పలుకరించినా సంతప్తి, ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. మూడేళ్లలోనే ఏకంగా రూ.1.72 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. సచివాలయ వ్యవస్థతో అర్హులందరికీ పథకాలు చేరవేస్తున్నామన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీలు చిన్న చిన్న సమస్యలను కూడా రాష్ట్ర సమస్యగా చిత్రీకరిస్తూ అల్లర్లు సృష్టించే కార్యక్రమాలు చేపడుతున్నాయని విమర్శించారు. తమకు అనుకూలమైన మీడియాను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజాప్రతినిధులంతా గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును పరిశీలిస్తున్నామన్నారు. ప్రతిపక్షాలకు ధైర్యముంటే వాళ్లు కూడా జనంలోకి వచ్చి విచారణ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, డీఈ చంద్రశేఖర్, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

పత్తి పంట పరిశీలన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలం వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పత్తి పంటను జిల్లా వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా నరసాపురం, గార్లదిన్నె, పసలూరు, సుంకేసుల గ్రామాల్లో సాగు చేసిన పత్తి పంటలో సోకిన గులాబీ రంగు పురుగును పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా రీసోర్స్ డైరక్టర్ మద్దిలేటి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పురుగును అరికట్టడానికి యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులందరూ ఫెరమోన్, ట్రాప్‌ను వాడాలన్నారు. అలానే సామూహికంగా రైతులందరూ సమ్మర్ పత్తిని సాగు చేయకూడదన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిశోర్‌రెడ్డి వేసవిలో పత్తిపంటను సాగు చేస్తే గులాబీ రంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. ముఖ్యంగా తొలకరిలో సాగు చేయడం వల్ల గులాబీ రంగు పురుగు మళ్లీ ఖరీఫ్ పత్తికి కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి డైరెక్టర్ మద్దిలేటి, తాడిపత్రి ఎడిఎ చెంగల్‌రాయుడు, మండల ఎఒ ఆంజనేయులు, ఆర్బీకే సిబ్బంది ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.




పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నియోజకవర్గానికి జలకళ

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-యల్లనూరు

నియోజకవర్గంలోని అన్ని చెరువులు నీటితో నిండి జలకళ సంతరించుకోవడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం యల్లనూరు మండలం గండికోట రిజర్వాయర్ నుంచి గడ్డంవారిపల్లి చెరువుకు నీళ్లు వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మంచినీటి వనరులకు సంబంధించిన ప్రతిపాదనలు, సాధ్యాసాధ్యాలను ఒక నివేదిక రూపంలో సిఎం జగన్‌కు అందించగా వెంటనే నీరివ్వాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇందులో భాగంగానే గండికోట రిజర్వాయర్ నుంచి గడ్డంవారిపల్లి చెరువుకు నీరు ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలో సాధ్యమైనంతవరకు చెరువులు, వాగులు, కాలువల్లో నీరు నిల్వ ఉండేలా చేయాలనేది తన కల అన్నారు. ఈ కార్యక్రమంలో యల్లనూరు జడ్పిటిసి బోగాతి ప్రతాప్‌రెడ్డి, మండల వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



తహశీల్దార్ ఈశ్వరయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న వ్య.కా.సం నాయకులు

భూమిలేని పేదలకు భూపంపిణీ చేయాలి

వ్యకాసం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి

బెలుగుప్ప : మండలంలోని ప్రతి నిరుపేద, వ్యవసాయ కార్మికులకు భూపంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సాగు భూమిలేని ప్రతి కుటుంబానికీ ఐదెకరాల భూమి ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న భూమిలేని నిరుపేదలకు ఎనిమిదవ విడతలో భూపంపిణీలో పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి హెచ్.అశోక్, సిఐటియు నాయకులు భీమన్న, బి.ఎర్రస్వామి, మల్లికార్జున, వెంకటేశులు, పెన్న ఓబులేసు, నాగభూషణ, బాలప్ప, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బి.పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఉత్తమ అవార్డు



కలెక్టర్ నుంచి మొమెంటో అందుకుంటున్న వైద్యాధికారి జగదీష్

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ టీం ఉత్తమ ఆరోగ్య కేంద్రంగా అవార్డు లభించింది. దీంతో కలెక్టర్ నాగలక్ష్మితో స్థానిక వైద్యాధికారి జగదీష్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పప్పూరు వైద్యశాల వైద్యులు, వైద్య సిబ్బందిని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

శింగనమల : రైతులు పండించిన పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సలకంచెరువు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు విత్తనం నాటినప్పటి నుంచి పంట కొనుగోలు చేసే వరకూ రైతు భరోసా కేంద్రాలు బాధ్యత తీసుకుంటున్నాయని ప్రభుత్వం చెబుతున్నా.. వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఎందుకంటే వేరుశనగ పంటను నూర్పిడి చేసిన రైతులు గిట్టుబాటు ధర లేక కళ్లాల్లోనే కాపలా ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే పంటలను కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు తరిమెల రామాంజినేయులు, నారప్ప, బయన్న, కోనప్ప, నాగరాజు, లక్ష్మిరంగయ్య, ఓబిరెడ్డి, వెంకటరాముడు, ఆదెన్న, తదితరులు పాల్గొన్నారు.

అశ్వర్థ నారాయణస్వామికి పూజలు

పెద్దపప్పూరు : కార్తీక మాసం పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం మండలం పరిధిలోని అశ్వర్థ నారాయణస్వామి, శ్రీ భవానీలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్ల కళ్యాణం ఘనంగా చేశారు. తాడిపత్రి మండలం ఆలూరు గ్రామానికి చెందిన పసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు స్వామిఅమ్మవార్లకు వివాహం చేయించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. వచ్చిన భక్తులకు నారాయణస్వామి కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి అన్నదానం చేశారు.

అసిస్టెంట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ పరిపాలన అవగాహనలో భాగంగా శిక్షణలో ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్ మంగళవారం అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కమిషనర్ ఛాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో సమావేశమై కార్యకలాపాలు, అనుసరించే విధివిధానాలు, నిబంధనలను కమిషనర్ భాగ్యలక్ష్మి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఇ నాగమోహన్, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, హెల్త్ఆఫీసర్ గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్

ఉద్యోగులను భయపెట్టాలనుకోవడం అవివేకం

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి : మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌పై దురుకుగా ప్రవర్తించి ఉద్యోగుల్లో భయాన్ని పెంపొందించి పబ్బం గడుపుకోవాలనుకోవడం అవివేకమైన చర్యని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ మహిళ అని కూడా చూడకుండా దురుసుగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. స్వయానా కలెక్టర్ మీదికే ఫిర్యాదు పత్రాలను విసిరివేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ప్రతిసారీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రి ప్రజలను కలుపుకుని మాట్లాడుతుంటారు కానీ.. తాడిపత్రి ప్రజలు మాత్రం ఆయన్ను కలుపుకోలేదన్నారు. అలాగే పోలీసు వ్యవస్థపై చులకనగా మాట్లాడడం, పోలీస్‌స్టేషన్‌కి బీగాలు వేయడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు దాడులు నిర్వహిస్తే ప్రయివేటు కేసులు వేయించడం ఆయనకు అలవాటైందన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు ఏవిధంగా పనిచేయాలో ప్రభాకర్‌రెడ్డి చెబితేనే అధికారులు తెలుసుకోవాలనుకోవడం అతని అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రజల్లో రాజకీయంగా ఆదరణ లేకపోవడంతో స్పృహ కోల్పోయి సొంత నిర్ణయంతో మాట్లాడలేని పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం జేసీ ప్రభాకర్‌రెడ్డి వీధులలో తిరుగుతుంటే (జె) జోకర్ (సి) కామెడీ చేయడానికి వస్తున్నారనరి ప్రజలు చర్చించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల ఒక మహిళా కౌన్సిలర్ పదేపదే ఎమ్మెల్యేకి దమ్మూధైర్యం ఉంటే అని మాట్లాడుతున్నారని, తాను ఎమ్మెల్యేగా బాధ్యతతో నడుచుకుంటున్నానన్నారు. తాను నియోజకవర్గ ప్రజల క్షేమం కోరుకుంటూ ఇక్కడే ఉండాలని అనుకుంటున్నానని, నా గత జీవితం వేరు అని.. నేను గతంలోకి వెళితే బోకులు.. బోలెలు ఎక్కడ ఉండేవో తెలిసి ఉండేవన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు, దౌర్జన్యాలకు తాను ఎప్పుడూ వ్యతిరేకమే అన్నారు. ఇప్పటికైనా జెసి ప్రభాకర్‌రెడ్డి తన తీరును మార్చుకోవాలని, లేనిపక్షంలో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

చిరుత దాడిలో మేక మృతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని కాశీపురం గ్రామంలో మేకపై చిరుత దాడి చేసి చంపినట్లు లక్ష్మీనారాయణ తెలిపాడు. పది రోజుల క్రితం ఇదే గ్రామంలో మరో మేకను చిరుత చంపిందని గ్రామస్తులు తెలిపారు. అటవీ శాఖ అధికారుల తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లైసెన్స్ ఉన్నవారు మాత్రమే ఎరువులు విక్రయించాలి

నార్పల : మండలవ్యాప్తంగా లైసెన్స్ ఉన్నవారు మాత్రమే పురుగు మందులు, ఎరువులు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి ముస్తఫా సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లైసెన్స్ ఉన్న వారు మాత్రమే ఎరువులు పురుగు మందులు విక్రయించాలన్నారు. అలాగే గడువు తీరిన లైసెన్సులు గడువులోగా రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. లేకుంటే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు..

ఫుట్‌పాత్ పనుల పరిశీలన

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో కూరగాయల మార్కెట్‌లో ఉన్న పెద్ద మురుగు కాలువ వద్ద ఫుట్‌పాత్ నిర్మాణం పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూర్‌బీ, వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా మంగళవారం పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం ఫుట్ పాత్ నిర్మిస్తుండంతో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నరేష్, మున్సిపాలిటీ డిఇ ఇంతియాజ్, ఎఇ శరత్ చంద్ర, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో పశువులకు ముద్దచర్మం వ్యాధి

రాయదుర్గం : పట్టణంలోని కొన్ని పశువులకు ప్రాణాంతకమైన ముద్ద చర్మం (లంపి స్కిన్) వ్యాధి సోకింది. పట్టణంలోని కోట మారమ్మ ఆలయ సమీపంలో ఉన్న పశువులు కొన్ని తరచూ పట్టణంలోని బిటిపి రోడ్డు, చర్చి వద్ద, ప్రధాన రహదారిలో సంచరిస్తుండగా వ్యాధి లక్షణాలు ఉన్న పశువులను స్థానికులు గుర్తించారు. ఈ విషయం పశువైద్యాధికారికి తెలిపారు. పశువుల చర్మంపై గుండ్రటి బొడిపెలు పలుచోట్ల కనిపించాయి. ఇలాంటి వ్యాధి లక్షణాలు డి.హీరేహాల్ మండలం ఎం.హనుమాపురంలోని పశువులకు సోకినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం పశు వైద్యాధికారి డాక్టర్ నవీన్ స్పందిస్తూ వ్యాధి లక్షణాలు ఉన్న పశువులను యజమానులు తమ దృష్టికి తీసుకొస్తే వ్యాక్సిన్లు వేస్తామన్నారు.

మూఢనమ్మకాలను విడనాడుదాం : జెవివి

రాయదుర్గం : గ్రహణం సమయంలో ఆహారం తీసుకోవడం వల్ల ఎలాంటి అనార్థాలు జరగవని, ఆహారం తీసుకోవద్దనడం కేవలం మూఢ నమ్మకమని జనవిజ్ఞాన వేదిక తాలుకా అధ్యక్షులు జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు ఆవుల మనోహర్ అన్నారు. చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం సాయంత్రం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రహణం సమయంలో అల్పాహారం తినడంతోపాటు స్థానికులకు పంపిణీ చేశారు. సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖపై వచ్చి భూమినీడ చంద్రుడిపై పడిన సందర్భంలో చంద్రగ్రహణం ఏర్పడుతుందని వివరించారు. గ్రహణాలు ప్రతీ ఏడాది వస్తుంటాయని, ఇది సహజ సిద్ధంగా జరిగే ప్రక్రియ అన్నారు. కావున మూఢనమ్మకాలను విడనాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బంగిశివ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదరించండి : పోతుల



ప్రచారం నిర్వహిస్తున్న పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

అనంతపురం : ప్రజా ఉద్యమాలకు సహకరించినట్లే పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను ఆదరించాలని పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు అభ్యర్థించారు. మంగళవారం నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలతోపాటు జర్నలిస్టులను కలిసి ఓటు వేసి వేయించాలని అభ్యర్థించారు. ఇప్పటికూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేపట్టామని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదరిస్తే శాసనమండలిలో మరింత వాణి వినిపిస్తానన్నారు. పట్టభద్రులు, నిరుద్యోగులు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

విభజన చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం

విభజన చట్టాన్ని అమలు చేసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడాలని రైతు కూలీ సంఘం అధ్యక్షులు ఇండ్ల ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి అధ్యక్షతన పప్పూరు రామాచార్యులు జయంతి సభ మంగళవారం నిర్వహించారు. ముందుగా పప్పూరు రామాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతులు వేదిక రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష్, వికేంద్రీకరణ సాధన సమితి కె.వి రమణ, హనుమన్న, కె.పి కుమార్, రాయలసీమ కళావేదిక శివానంద, రత్నమ్మ, చరిత, రచయితలు టివిరెడ్డి, షేక్ కంబదూరి నబీరసూల్, వన్నప్ప, మధురశ్రీ, పిడిఎస్‌యు వీరేంద్ర, ప్రసాద్, అరుణోదయ చంద్ర, ప్రజాసంఘాల నాయకులు చంద్రమహేష్, శ్రీనివాసరెడ్డి, టి.పి రామన్న, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వెలుగు సాహిత్య, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో

తెలుగు వెలుగు సాహిత్య, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పప్పూరు రామాచార్యుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సంస్థ అధ్యక్షులు టివి రెడ్డి మాట్లాడుతూ రామాచార్యుల సేవలు ఆదర్శప్రాయమన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, శ్రీసాధన పత్రిక సంపాదకులుగా, రాయలసీమ గొంతును వినిపించే శ్రీబాగ్ ఒడంబడిక కమిటీ సభ్యులుగా, అనంతపురం పురపాలక సంఘం ఛైర్మన్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా, ధర్మవరం శాసనసభ్యులుగా అనేక సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీశక్తి పీఠం అధ్యక్షులు కల్లూరు గుర్రాజు, యువకవి జి.అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్టేడియాలను కాపాడాలని వినతి



ఎమ్మెల్యే అనంతకు వినతిపత్రం సమర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్టేడియాలను పేఅండ్‌ప్లే పేరుతో ప్రయివేటు కాంట్రాక్టర్లకు లీజుకు ఇవ్వకుండా కాపాడాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) నాయకులు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్టేడియాలను పేఅండ్‌ప్లే పేరుతో ప్రయివేటు కాంట్రాక్టర్లకు లీజ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. దీనికి సంబంధించిన టెండర్ల సైతం అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని నీలం సంజీవరెడ్డి, నార్పల, కళ్యాణదుర్గంలోని స్టేడియాలను ప్రయివేటు పరం చేసేందుకు పూనుకున్నారన్నారు. ఇదే జరిగితే పేద, మధ్యతరగతి విద్యార్థులు, యువజనులను ఆటలకు దూరం అవుతారన్నారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించి ఉచిత శిక్షణ ఇవ్వాల్సిన ప్రభుత్వం ఆటస్థలాలను ప్రయివేటు వ్యక్తులు లీజుకివ్వడం దారుణమన్నారు. ప్రభుత్వ వెంటనే స్పందించి స్టేడియాలను ప్రయివేటు వ్యక్తులకు లీజ్ పేరుతో ఇచ్చిన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పరమేష్, విజయ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.